క్లుప్తంగా

తెలుగు సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పాలి

● ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: పవిత్ర సంక్రాంతి పండుగను పురస్కరించుకొని తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుల అరెస్ట్



మద్యం సీసాలను సీజ్ చేసిన ఎస్‌ఐ శివరామయ్య

మద్దిపాడు: దొడ్డవరంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ శివరామయ్య తన సిబ్బందితో కలిసి బొడ్రాయి సెంటర్ వద్ద ఉన్న చిన్నమ్మాయి అనే మహిళ కు చెందిన స్థలంలో తనిఖీ చేయగా అక్కడ 48 క్వార్టర్ సీసాలు బయటపడ్డాయి. క్రమంలో ఆ మహిళను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

నేడు రెండు జిల్లాల స్థాయి పొట్టేళ్ల బలప్రదర్శన

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరులో కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం నుంచి సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల స్థాయిలో పొట్టేళ్ల బలప్రదర్శన నిర్వహిస్తారు. మొదటి నుంచి నాలుగో బహుమతులు వరుసగా రూ.40 వేలు, రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.5 వేలు అందజేస్తారు. 14వ తేదీ ట్రాక్టర్ ట్రాలీ రివర్స్ పోటీలు నిర్వహిస్తారు. తాడు లాగే పోటీల్లో టీముకు ఐదుగురు చొప్పున పాల్గొనాలి. 15వ తేదీ నాటు బండి రాదా ఎడ్ల పోటీలు మండల స్థాయిలో నిర్వహిస్తారు. ఈ పోటీలకు వరుసగా ఐదు బహుమతులు రూ.20 వేలు, రూ.18 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా వివేకానంద జయంతి



స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఒంగోలు సిటీ: వివేకానంద జయంతి సందర్భంగా స్థానిక శర్మ కాలేజీలోని వివేకానంద విగ్రహానికి లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ ఫౌండర్ కూరపాటి రమేష్, అధ్యక్షుడు ఈదర వెంకటేష్, కార్యదర్శి గ్రంధే పార్ధసారధి, లక్ష్మణ స్వామి, పల్లపు సుబ్బయ్య, తమ్మన ఆంజనేయులు, అబ్బిశెట్టి జనార్ధన, నవీన్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జీఎమ్మార్ వెల్ఫేర్ కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు టౌన్ : జీఎమ్మార్ మదనపల్లి ఓల్డ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ నూతన సంవత్సర కేలండర్‌ను ఆదివారం ఒంగోలు నగరంలోని సీవీఎన్ రీడింగ్ రూంలో ఆవిష్కరించారు. జిల్లా కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ సలహాదారుడు బేతాళ శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లి రమేష్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర జనరల్ సెక్రటరీ కరవది సుబ్బారావు, జిల్లా సభ్యులు కోటి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

సంతనూతలపాడు: మండల కేంద్రంలోని జెండా చెట్టు అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు రెడ్డి గారి బజార్‌లోని ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా గ్రైండర్, రెండో బహుమతిగా ప్రెజర్ కుక్కర్, మూడో బహుమతిగా స్టీల్ డిన్నర్ సెట్ అందజేస్తామని పేర్కొన్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న 30 మందికి కన్సోలేషన్ బహుమతులు పంపిణీ చేస్తామని తెలిపారు. కనుమ రోజున బహుమతి ప్రదానోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివరాలకు 7330636888, 703624425ను సంప్రదించాలని సూచించారు.

తాగు, సాగునీటి చెరువు కబ్జా

- కుచించుకుపోతున్న తెల్లబాడు చెరువు
- తూతూమంత్రంగా సర్వే చేసిన అధికారులు
- పంచాయతీ కార్యాలయంలో కొలతలు మాయం



రోడ్డుకు అడ్డంగా నిర్మించిన గోకులం షెడ్

మద్దిపాడు: మండలంలోని తెల్లపాడు గ్రామానికి చెందిన చెరువు ఆక్రమణకు గురై కుచించుకుపోతోందని గ్రామస్తుల కొందరు అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. కొంతకాలం నుంచి తెల్లపాడు గ్రామానికి చెందిన వ్యక్తి తెల్లపాడు రెవెన్యూ పరిధిలోని తాగు, సాగునీటి చెరువును కబ్జా చేసి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సిమెంటు రోడ్డుకు ఆటంకం కలిగిస్తున్నాడని అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని పంచాయతీ రోడ్డును ఆక్రమించి నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డును పక్కకు దారి మళ్లించాడంటూ ప్రచారం జరుగుతోంది. ప్రశ్నించిన గ్రామస్తులకు అడ్డుగోలుగా సమాధానం చెబుతూ అసభ్య పదజాలంతో దూషిస్తూ వీరంగం సృష్టిస్తున్నాడని స్థానికులు మండిపడుతున్నారు. కొంతకాలం నుంచి గ్రామ పంచాయతీ, మండల రెవెన్యూ అధికారులు, జిల్లా ఉన్నతస్థాయి అధికారులకు అర్జీలు ఇచ్చినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఇటీవల కాలంలో మండల సర్వే అధికారి అక్కడికి వెళ్లి తూతూమంత్రంగా సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించలేదు. సదరు అక్రముదారుడునికి అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సదరు మండల సర్వేయర్ ఉన్నత స్థాయి అధికారులకు చెరువు కబ్జాపై ఎటువంటి నివేదికను సమర్పించకుండా ముడుపులు పుచ్చుకున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. కొంతకాలం నుంచి చెరువు అలుగు ప్రదేశాన్ని ఆక్రమించి అక్రమణదారుడు గేదెలు కట్టేయడంతో పశువుల వ్యర్థం చెరువు నీటిలో కలిసి నీరు కలుషితమవుతున్నాయని, దీంతో తాగునీటి బావిలోకి పశువుల వ్యర్థాలతో కూడిన నీరు ఊటగా బావిలోకి వస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయంలోని గ్రామ కంతాలకు సంబంధించిన బజారు కొలతల రికార్డులు మాయమైనట్లు పంచాయతీ అధికారులు తెలుపుతున్నారని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో రైతులు తమ సొంత స్థలాల్లో పశువుల షెడ్ల నిర్మాణానికి గోకులం పథకం కింద నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో గోకులం షెడ్ నిర్మాణం చేపట్టడం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. ఈ క్రమంలో అక్రమంగా ఆక్రమించి చెరువు అలుగు స్థలంలో గోకులం షెడ్ నిర్మిస్తుంటే నిధులు మంజూరు చేయడమేమిటోనని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల పనితీరు విడ్డూరంగా ఉందని ఆరోపణలు చేస్తున్నారు. చెరువు ఆక్రమణపై సమగ్ర విచారణ జరిపి సమస్యను పరిష్కరించాలని తెల్లపాడు గ్రామస్తులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చుండూరు రవిబాబు, పాల్గొన్న నాయకులు

పథకాల అమలులో కూటమి విఫలం

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా సంక్షేమ పథకాల అమలులో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు అన్నారు. ఆదివారం ఒంగోలు నగరంలోని 21వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు అధ్యక్షత వహించగా, చుండూరు రవిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ఎంతో మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరిందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. డివిజన్లలో ఏ సమస్యలున్నా పార్టీ స్థానిక అధ్యక్షుల ద్వారా పరిష్కారం చేస్తానన్నారు. 21వ డివిజన్ అధ్యక్షునిగా మద్దాల రవిచంద్రను ప్రకటించారు. సమావేశంలో పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు బొట్లా సుబ్బారావు, లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, కార్పొరేషన్ కో ఆప్షన్ మెంబరు సాగర్, వైఎస్సార్ సీపీ నాయకులు వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి, జనార్దనరెడ్డి, పిగిలి శ్రీను, శ్రీనివాసరెడ్డి, మేరీ, ప్రసన్న, వాణి, కె.కోటియాదవ్, మలిశెట్టి దేవ, పులుసు సురేష్‌బాబు, జెడ్డా చిన్న, ఆవుల అనీల్, ఈసు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గేంత వరకు పోరాటం

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాల వలన నిత్యావసర ధరలు పెరిగిపోయి నిరుపేద ప్రజలు అల్లాడుతున్నారని, ధరలు తగ్గించేంత వరకు ఐద్వా పోరాటం చేస్తుందని ఆ సంస్థ నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నగరంలోని చైతన్య కాలనీలో డీవైఎఫ్‌ఐ, ప్రజా నాట్యమండలి, ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు, యువకులు, చిన్నారులకు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలు 70 మందికి బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిత్యావసర ధరలు పెరగడంతో ఇళ్లు గడవడం కష్టమైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర ధరలు తగ్గించాలని కోరుతూ జరిపే పోరాటంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొద్దామని చెప్పారు. ప్రజానాట్యమండలి నగర కార్యదర్శి ఎస్.జ్యోతి మాట్లాడుతూ చదువుతో పాటు



ఆటల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ఏదైనా ఒక వృత్తిలో నైపుణ్యం సాధించాలని, అందుకోసం కాలనీలోని పిల్లలకు బొమ్మలు వేయడం లాంటి వాటిలో శిక్షణ ఇస్తామని చెప్పారు. డి.మధురవాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీ రమేష్, సువర్ణరాజు, ఎస్.సురేష్, అనిత ప్రత్యూష, సీహెచ్ రామయ్య, రామారావు భరత్, డి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

సంతనూతలపాడు: మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయం ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం ఒంగోలు లక్కీ షాపింగ్ మాల్ సౌజన్యంతో స్థానిక వాసవీ క్లబ్, వాసవీ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. విజేతలకు మాజీ జెడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు వేమూరి వెంకట శేషారావు, వాసవీ మహిళా క్లబ్ అధ్యక్షురాలు చలువాది చంద్రావతి, వాసవి క్లబ్ జిల్లా ప్రతినిధులు వేమూరి నాగేంద్ర ప్రసాద్ రావు, గ్రంధి లక్ష్మీప్రసాదరావు తదితరులు బహుమతులు పంపిణీ చేశారు. ఈ ముగ్గుల పోటీల్లో 30 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్ధ బహుమతులను వంగపాటి శివకుమారి, వంగపాటి నాగలక్ష్మి, టి.ప్రమీల, మద్ది సునీత లు గెలుచుకున్నారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ బెడ్ షీట్లను కన్సలేషన్ బహుమతులు కింద పంపిణీ చేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు మాస్టర్ కోదాటి కోటేశ్వరరావు, రిటైర్డ్ హెచ్‌ఎం పి.పి.శ్రీనివాస్, మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.వి.రమణారెడ్డి వ్యవహరించారు. ముగ్గుల పోటీలకు వాసవి క్లబ్ జిల్లా ప్రతినిధి వేమూరి నాగేంద్ర ప్రసాద్ రావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు జీ శరత్ బాబు, సీపీఎం జిల్లా నాయకులు ఎస్. వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య నాయకులు శిఖాకొల్లి వెంకటేశ్వర్లు, వాసవి క్లబ్ అధ్యక్షుడు వీవీ శేషారావు, సెక్రటరీ వి.ఆంజనేయులు, కోశాధికారి పి.సుధాకర్, గౌరవ అధ్యక్షుడు పొదర్తి గిరి, వాసవి మహిళా క్లబ్బు అధ్యక్షురాలు సీహెచ్ చంద్రావతి, సెక్రటరీ శిఖాకొల్లి జయ శ్రీ, కోశాధికారి గాదంశెట్టి శ్రీలక్ష్మి, గౌరవ అధ్యక్షురాలు గ్రంధి సులోచన, వాసవి మహిళా క్లబ్ మాజీ అధ్యక్షురాలు ఎస్ విజయలక్ష్మి, జీ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చీమకుర్తి: విజేతలకు బహుమతులను అందిస్తున్న చెరుకూరి రఘుకిరణ్

అలరించిన ముగ్గుల పోటీలు

నాగులుప్పలపాడు: సంక్రాంతి సందర్భంగా మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో వాసవీక్లబ్, మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ మండలాల నుంచి 40 మంది మహిళలు ఆసక్తిగా పాల్గొన్నారు. పోటీలో మహిళలు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ మహిళల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు వాసవి క్లబ్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి సంక్రాంతి సంబరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన మచ్చా మాధవి, కోటేశ్వరమ్మ, విజయ, మోట సుమతి, మాలంపాటి శ్రవణప్రియకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కొంజేటి సురేష్ బాబు, మాదాసు రాంబాబు, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు, అమరా వేణు, రాజేష్, రాఘవేంద్రరావు, శైలజ, కోట వెంకటేశ్వర్లు, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

చీమకుర్తి: సంక్రాంతి పండుగ సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చీమకుర్తిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థినిలకు ఈ పోటీలు నిర్వహించారు. చీమకుర్తిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని కే.ప్రియాంకకు ప్రథమ బహుమతి, చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలుకు చెందిన విద్యార్థిని గోలి గోవర్ధనికి ద్వితీయ బహుమతి, ప్రభుత్వ హైస్కూలుకే చెందిన షేక్ అస్రీ మున్నీసాకు తృతీయ బహుమతి వచ్చింది. పీ.హేమలత, ఎన్.నాగలక్ష్మి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా హాజరైన చెరుకూరి నాగరత్నం చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ వ్యవస్థాపకుడు చెరుకూరి రాఘుకిరణ్, కార్యదర్శి కే.సుధాకర్, మాజీ అధ్యక్షులు, కార్యదర్శులు యడ్లపల్లి రామబ్రహ్మం, గోరంట్ల వెంకట్రావు, అంబటి వీరారెడ్డి, పరాంకుశం శ్రీనివాసమూర్తి, ముప్పూరి చలమయ్య, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



ఒంగోలు గద్దలగుంటలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



శర్మ కాలేజీ మైదానంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ఒంగోలు మెట్రో: ఒంగోలు గద్దలగుంట గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గద్దలగుంటలోని రామాలయం వద్ద సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానిక మహిళలకు ఆదివారం సాయంత్రం ముగ్గులు పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతిని సౌమ్య, ద్వితీయ బహుమతిని లీలావతి, తృతీయ బహుమతిని పి.సుబ్బలక్ష్మి గెలుచుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా పీ కృష్ణకుమారి, డి.శాంతికుమారి, గద్దలగుంట గ్రామ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి ఆరిగ శ్రీనివాసరావు, న్యాయవాది చిట్ట వెంకటేశ్వర్లు, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వవికాస భారతి సేవా సంస్థ ఆధ్వర్యంలో...

ఒంగోలు నగరంలోని సీతారామపురంలోని శర్మ కాలేజీ మైదానం వద్ద ముందస్తు సంక్రాంతి సంబరాలలో భాగంగా ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంస పత్రాలు, కన్సొలేషన్ బహుమతులు అందించారు. నగర మేయర్ గంగాడ సుజాత, నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, వివిధ విద్యాసంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉలిచిలో నేటి నుంచి సంక్రాంతి సంబరాలు...

ఒంగోలు టౌన్: ఒంగోలు మండలంలోని ఉలిచి



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అభ్యుదయ సమితి ప్రతినిధులు

గ్రామంలో ఉలిచి అభ్యుదయ సేవాసమితి ఆధ్వర్యంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు గార్లపాటి రామారావు తెలిపారు. ఆదివారం గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చుంచు నాగేశ్వరరావు చెప్పారు. పక్కింటి మొగుడు, పడమటి గాలి నాటకాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రజలు, కళాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో బోయిడి ఆంజనేయులు, చప్పిడి రవీంద్రబాబు, బొద్దులూరి రామారావు, బొద్దులూరి హనుమంతరావు, చేజర్ల వెంకటరావు, ఉప్పలపాటి వెంకటేశ్వర్లు, చంచు రామకృష్ణ, ఇనగాల చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

పంతం నీదా నాదా సై

- రోడ్డు నిర్మాణంలో టీడీపీ, జనసేన నాయకుల వాగ్వివాదం
- టీడీపీ నేతను స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- ఎమ్మెల్యే కనుసన్నల్లోనే జరిగిందని తెలుగు తమ్ముళ్ల ఆగ్రహం



టీడీపీ-జనసేన నాయకుల మధ్య తగాదాతో నిర్మాణం ఆగిన సీసీ రోడ్డు

నాగులుప్పలపాడు: మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఒక సీసీ రోడ్డు.. జనసేన, టీడీపీ నాయకుల మధ్య అంతర్గత పోరును బట్టబయలు చేసింది. జనసేన నాయకుడు నిర్మిస్తున్న ఈ రోడ్డులో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోగా తమ సొంత స్థలాల్లో నిర్మాణాలను సైతం కూలదోశారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సార్వత్రిక ఎన్నికల తర్వాత నాగులుప్పలపాడు టీడీపీలోని రెండు వర్గాలను దూరం పెట్టిన ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్.. జనసేన నాయకులను ప్రోత్సహిస్తూ వస్తున్నారని స్థానికంగా చర్చ నడుస్తోంది. టీడీపీలో కీలక సామాజికవర్గం వారు నివసిస్తున్న ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణ బాధ్యతను జనసేన నాయకులకు అప్పగించడంతో అంతర్గత పోరుకు మరింత ఆజ్యం పోసినట్లయింది. ఇదిలా ఉండగా ఆక్రమణలు పూర్తిగా తొలగించి రోడ్డు నిర్మించాలని టీడీపీలోని ఓ వర్గం కోరింది. అయితే ఒక వర్గానికి చెందిన వారి ఇళ్ల వద్దే ఆక్రమణలు తొలగించి, మరో వర్గం వారు ఉంటున్న ప్రాంతాన్ని వదిలేశారు. దీంతో ఆగ్రహించిన టీడీపీలోని ఒక వర్గం నాయకులు శనివారం ట్రాక్టర్ అడ్డుపెట్టి రోడ్డు నిర్మాణ పనులను ఆపారు. ఒక గంట తర్వాత రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్నందుకుగాను టీడీపీ గ్రామ పార్టీ మాజీ అధ్యక్షుడు ఉన్నం వెంకట్రావును పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఇదంతా సాగుతోందని టీడీపీలోని ఓ వర్గం రగిలిపోతోంది. గ్రామంలో ఎవరు పెత్తనం చేయాలో పండగలోపే తేల్చుకుంటామని బాహాటంగానే చెప్పడంతో పరిస్థితులు రసవత్తరంగా మారాయి.


ఘనంగా ధనుర్మాస వేడుకలు



గోదాదేవి కళ్యాణ వ్రత మహోత్సవంలో తిరుమంజన సేవలో పాల్గొన్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, హనుమంతరావు

చీమకుర్తి రూరల్: మండలంలో కేవీ అగ్రహారంలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ధనుర్మాస వేడుకల్లో గోదాదేవి కళ్యాణ వ్రత మహోత్సవంలో తిరుమంజన సేవ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, హనుమంతరావు, గోదాదేవికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెంకటేశ్వరాచార్యులు పూజలు చేయించారు. అధిక పంఖ్యలో భక్తులు స్వామి అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వాదాలు తీసుకున్నారు.

తెప్పోత్సవాన్ని విజయవంతం చేయండి




మాట్లాడుతున్న శిద్దా రాఘవరావు, శిద్దా హనుమంతరావు

చీమకుర్తి రూరల్: కృష్ణ సాయి గ్రానైట్స్ ఆధ్వర్యంలో కేవీ అగ్రహారంలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో సోమవారం శ్రీవారి పుష్కరిణిలో జరిగే తెప్పోత్సవాన్ని జయప్రదం చేయాలని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కోరారు. ఆదివారం దేవస్థానంలో శిద్దా హనుమంతరావు, శిద్దా భరత్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధనుర్మాసం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఉదయం గోదా తిరు కళ్యాణ మహోత్సవం, సాయంత్రం 5 గంటలకు శ్రీవారి పుష్కరిణిలో తెప్పోత్సవం, ఎనిమిది గంటలకు ఊంజల్ సేవ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ ప్రభ, కోలాటం, బృందావన భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిద్దా పాండురంగారావు, నూనె వెంకటసుబ్రహ్మణ్యం, మారం వెంకారెడ్డి ఉదయ్, కోట బాలకృష్ణ దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక రక్షణ చట్టం అమలు చేయాలి

ఒంగోలు టౌన్: రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం అమలు చేయాలని రజకవృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి రాయల మాలకొండయ్య డిమాండ్ చేశారు. సంస్థ కార్యాలయంలో 2025 నూతన సంవత్సర కేలండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో దాదాపు 500 అపార్ట్‌మెంట్లు ఉన్నాయని, వాటిలో అనేక మంది రజక వృత్తిదారులు వాచ్‌మెన్లుగా, పనివాళ్లుగా, ఇస్త్రీ చేసేవారుగా పనులు చేస్తూ జీవిస్తున్నారని తెలిపారు. 50 సంవత్సరాలుగా పనిచేస్తున్న రజకవృత్తిదారులకు, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్లకు పెన్షన్లు మంజూరు చేయాలని, ఇస్త్రీ వృత్తి చేస్తున్న రజకులకు 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా ఇవ్వాలని, బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నిరుపేద రజకులకు నివేశన స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒంగోలు నగర అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు చందలూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు టంగుటూరి రాము, చీమకుర్తి కోటేశ్వరరావు, వెంకటనారాయణ, కళ్లగుంట శ్రీను, డాన్ శ్రీను, నాయక్, నాగేశ్వరరావు, డాక్టర్ కృష్ణయ్య, చిట్యాల కొండయ్య, శోభన్ బాబు, ప్రసాదు, ఏడుకొండలు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరిస్తున్న అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు

ఎమ్మెల్సీ పర్వతరెడ్డిని కలిసిన వైఎస్సార్ టీఏ నాయకులు



ఎమ్మెల్సీ పర్వతరెడ్డితో వైఎస్సార్ టీఏ నాయకులు

ఒంగోలు సిటీ: ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాలిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వైఎస్సార్ టీఏ నాయకులు నెల్లూరు రాంజీ నగర్ ఆఫీస్‌లో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండరు, డైరీని ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. డైరీలకు రూ.లక్ష విరాళంగా ఎమ్మెల్సీ అందజేసినందుకు నాయకులు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. వైఎస్సార్ టీఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మట్టిగుంట మహేశ్వరరావు, రమణారెడ్డి, నాయకులు శివశంకర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, సురేంద్ర, గోవిందస్వామి, వైఎస్సార్ టీఏ సంఘ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఒంగోలు సిటీ: నగరంలోని గోపాల్‌నగర్ శాంతి పబ్లిక్ స్కూల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 2003 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 22 ఏళ్ల తర్వాత కలుసుకుని ఆనందంగా గడిపారు. చిన్ననాటి స్మృతులను నెమరువేసుకుని మనసారా నవ్వుకున్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

చీమకుర్తి రూరల్: బూదవాడ సచివాలయ పరిధిలోని ఎల్లయ్య నగర్ కాలనీలో మంచినీటి సమస్య పరిష్కరించాలని ఆదివారం సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి పల్లామల్లి ఆంజనేయులు మాట్లాడుతూ.. ఎల్లయ్య నగర్‌లో మంచినీటి కోసం 20 ఏళ్ల క్రితం వాటర్ హెడ్ ట్యాంకు నిర్మించినా ఇప్పటికీ పైపులైన్ వేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టి, ఆ తరువాత కాలనీ వైపు చూడటం లేదన్నారు. ఎల్లయ్య నగర్లో మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు శీలం ఆదినారాయణ, నుగ్గు శ్రీను, మర్రిచెట్లపాలెం శాఖ కార్యదర్శి, జి.ప్రభుదాసు ఇమ్మానియేలు, క్రాంతి కుమార్, రాకేష్, జిలాని, దావీదు స్థానికులు పాల్గొన్నారు.